క్లుప్తంగా

విద్యాప్రమాణాలు మెరుగుపడాలి



రేగిడి: మాట్లాడుతున్న ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు

రాజాం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో క్రాఫ్ట్ బొమ్మలు తయారు చేయించడంతో పాటు ఆటపాటలతో పాఠ్యాంశాలను బోధించారు. పెనుబాక యూపీ పాఠశాలలో హెచ్‌ఎం మహేశ్వరరావు ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం చేపట్టారు.

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలో లచ్చారాయపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం సందర్శించారు. పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక రేవుల వద్ద సీసీ కెమెరాలు



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారి రాజేశ్వరి

రేగిడి: ఇసుక రేవులు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఇసుక నియంత్రణ టాస్క్‌ఫోర్స్ అధికారి ఎస్.రాజేశ్వరి అన్నారు. మండలంలో వెంకటాపురం, సంకిలి, రేగిడి వద్ద నాగావళి నది ఇసుక రేవులను సోమవారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ రాములమ్మను కలిసి ఇసుక అక్రమ రవాణా నియంత్రణపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రతీ రేవు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నిరంతరం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఆమె వెంట ఎస్‌ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా ఫీవర్ సర్వే



వన్నలిలో ఫీవర్ సర్వేచేస్తున్న సిబ్బంది

రేగిడి: రేగిడి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలో వండానపేట, చాటాయివలస, అక్కన్నఅగ్రహారం, ఉప్పర్నాయుడువలస, వన్నలి గ్రామాల్లో సోమవారం ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్.అసిరినాయుడు సర్వేను పర్యవేక్షించారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందుకే ముందస్తుగా సిబ్బందితో సర్వే చేస్తున్నామని వైద్యాధికారి వివరించారు.

స్టూడెంట్ కిట్లు అందజేత



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న హెచ్‌ఎం

రాజాం సిటీ: మండలంలోని కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం స్టూడెంట్ కిట్లు అందజేశారు. పుస్తకాలతో పాటు బ్యాగు, బెల్టు, షూ అందజేశామని హెచ్‌ఎం వీవీ వసంతకుమార్ తెలిపారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గణితంపై పట్టుసాధించాలి



'పై' సింబల్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వంగర: విద్యార్థులు గణితంపై పట్టుసాధించాలని హెచ్‌ఎం ఎస్‌వీఎస్ సోమేశ్వరరావు అన్నారు. మండలంలోని యూఆగుమ్మడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'పై' దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణితంలో 'పై' ఎంతో కీలకమన్నారు. వృత్తం వైశాల్యాన్ని, చుట్టుకొలతను కనుక్కోవడానికి దీన్ని ఉపయోగిస్తారని అన్నారు. దీని విలువ సుమారు 22/7కు సమానమని, అందువలన జూలై 22వ తేదీన 'పై' దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు 'పై'ని సూచించే గ్రీకు అక్షర రూపంలో మానవహారం ప్రదర్శించారు.

రైతు బజార్‌కు ప్రతిపాదనలు

బొబ్బిలి: పట్టణంలోని రైతు బజార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్టు ఏఎంసీ కార్యదర్శి ఈశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. స్థలం కోసం రెవెన్యూ అధికారులకు లేఖ రాశామని, వారి నుంచి ఇంకా సమాచారం రావాల్సి ఉందన్నారు. అలాగే రూ.2 కోట్ల సెస్సు డిమాండ్ ఉండగా రూ.30 లక్షల సెస్సు వసూలు అయిందన్నారు.

కూటమి హామీలపై కోటి ఆశలు

- హామీల అమలుపై స్పందించని ప్రభుత్వం
- అస్తవ్యస్తంగా సాగునీటి కాలువలు
- అధ్వానంగా రహదారులు
- ఖరీఫ్‌కు తప్పని సాగునీటి ఇబ్బందులు



రేగిడి-సంతకవిటి మండలాల మధ్య అధ్వానంగా ఉన్న తోటపల్లి కాలువ

రాజాం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం వచ్చి సుమారు రెండు నెలలవుతున్నా.. హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై ఇంతవరకు ముందడుగు పడలేదు. రాజాం నియోజకవర్గంలో 80 శాతం మంది వ్యవసాయాధారితమై జీవనోపాధి సాగిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులు ప్రధానంగా ఎదుర్కొనే సాగునీటి సమస్య పరిష్కారంపై ఇంతవరకు దృష్టిసారించలేదు. జూలై నెలఖరు వచ్చినా మడ్డువలస, తోటపల్లి, నారాయణపురం, సాయన్నచానల్, వంటి ప్రధాన సాగునీటి కాలువలతో పాటు పిల్లకాలువల్లో పిచ్చిమొక్కలు, రెల్లిగడ్డి, తుప్పలు పెరిగిపోయి అధ్వానంగా మారాయి. ఆయకట్టు శివారు ప్రాంత పొలాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. రేగిడి, సంతకవిటి మండలాల్లో మడ్డువలస కాలువ ఆయకట్టు పిల్లకాలువలు పూర్తి అధ్వానంగా ఉన్నాయి. సంతకవిటి మండలంలో నారాయణపురం కుడికాలువలో పూడికలు తీయకపోవడంతో మంతిన దగ్గర నుంచి కాలువనీరు ఎగపోటుకడుతుంది. ఇదే మండలంలో వాసుదేవపట్నం నుంచి వాల్తేరు వరకు సాయన్నచానల్ పూర్తిగా గుర్రపుడెక్కతో నిండిపోయి నీరు పొలాల్లోకి వచ్చి వరి వెద పంటలను ముంపునకు గురిచేస్తుంది. రేగిడి మండలంలో వరదగెడ్డలు చిన్నపాటి వర్షాలకే పొంగిపొర్లుతున్నాయి. రాజాం మండలంలో తోటపల్లి కాలువ ద్వారా పిల్లకాలువలకు సాగునీరు అందని పరిస్థితి ఉంది. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగునీటి కష్టాలు తప్పేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్ల పరిస్థితి అంతే..

రాజాం ప్రధాన రహదారి విస్తరణ గాలిలో ఉంది. రోడ్డు పూర్తిగా గంతలుగా మారింది. రాజాం నుంచి సంతకవిటి, సంతకవిటి నుంచి పొందూరు వెళ్లే రహదారులు ఇరుకుగా, గోతులతో ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిని డబల్ రోడ్డు చేస్తామన్న హామీ ఇంతవరకూ ముందుకు వెళ్లలేదు. వంగర మండంలో సరసనాపల్లి-వంగర గ్రామాల మధ్య రహదారి ప్రమాదకరంగా ఉంది. వంగర నుంచి కొత్తవలస, రుషింగి గ్రామాలకు వెళ్లే రహదారులు విస్తరించాల్సి ఉంది. కింజంగి, బాగేంపేట గ్రామాలకు వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఇవే కాకుండా సంతకవిటి మండలంలో వాల్తేరు వద్ద వంతెన నిర్మాణం గత నాలుగునెలలుగా నిలిచిపోయింది. ఈ వంతెన వైఎస్సార్‌సీపీ హయంలో ప్రారంభమైంది. ఇంతవరకూ పనులు చకచక జరిగాయి. ఇదే మండలం సిరిపురం వద్ద రెల్లిగెడ్డ వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనకు శాశ్వత పరిష్కారం కల్పించాల్సి ఉంది. రాజాం పట్టణంలో రింగురోడ్డు హామీ అమలు చేస్తామని అనడంతో పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ రింగురోడ్డుకు సంబంధించి ఇంతవరకూ ఎటువంటి కార్యాచరణ ముందుకుసాగలేదు. ఈ సమస్యలు పరిష్కరించండి మహాప్రభో అంటూ నియోజకవర్గ ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యేను కోరుతున్నారు.



అధ్వానంగా మారిన రాజాం-సంతకవిటి రహదారి



సంతకవిటి మండలం రామారాయపురం సమీపంలో సాయన్నచానల్ ఆయకట్టు పరిధిలో నీటమునిగిన పంటపొలాలు

తోటపల్లి నీరు అందించాలి



తోటపల్లి కాలువ నీరు రాజాం, రేగిడి మండలాల్లో చాలా గ్రామాలకు ప్రధాన సాగునీటి ఆధారం. పిల్లకాలువల్లో రెల్లిపొదలు పెరిగిపోవడంతో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. అధికారులు, నాయకులు స్పందించి కాలువలు బాగుచేయాలి. ఖరీఫ్‌కు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– బంకి హరినాథ, రైతు, రేగిడి మండలం

డబల్ రోడ్డు అవసరం



రాజాం నుంచి సంతకవిటి, సంతకవిటి నుంచి పొందూరుకు డబల్ రోడ్డు అవసరం. వీటిని నిర్మిస్తామని హామీ ఇచ్చిన నేతలు వీటిపై దృష్టిసారించాలి. ప్రయాణికుల కష్టాలు తప్పించాలి.

– పొట్నూరు స్వాతికుమార్, చింతలపేట, సంతకవిటి మండలం

ముంపు సమస్య పరిష్కరించాలి



సాయన్నకాలువ ఆయకట్టు పరిధిలో ఏటా వేలాది ఎకరాల్లో పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయి. కొత్త ప్రభుత్వం కాలువలో పూడికలు తొలగించడంతో పాటు కాలువ గట్టును పటిష్టం చేయడం ద్వారా ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి రైతులను ఆదుకోవాలి.

– మూల లక్షున్నాయుడు, మల్లయ్యపేట, సంతకవిటి

శాంతియుత పాలన అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, కరణం సుదర్శనరావు

వంగర: ప్రభుత్వాలు మారడం సహజమని, టీడీపీ నేతలు ప్రజలకు శాంతియుతమైన పాలన అందించేందుకు కృషిచేయాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కరణం సుదర్శనరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ నాయకులు ఉద్యోగులను, చిరుద్యోగులను ఒత్తిడికి గురిచేస్తున్నారని, కొంత మందిపై చర్యలకు దిగడం అన్యాయమని అన్నారు. మండల అభివృద్ధికి తమతో సహా మండలంలో ఉన్న అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సహకరిస్తారని అన్నారు. ప్రజలకు మంచి చేసేందుకు అధికారాన్ని ఉపయోగించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎటువంటి రాజకీయ వేధింపులు లేవని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు, సుపరిపాలన అందించామని అన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ నేతలు ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు ఫిర్యాదులందించడం, కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడడం వంటి సంప్రదాయాలను తీసుకురావొద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పోలిరెడ్డి రమేష్, గర్భాపు నారాయుడు, పార్టీ నాయకులు బెజ్జిపురం విజయ్‌కుమార్, ఏనుగుతల వెంకటనాయుడు ఉన్నారు.

బిల్లులు మంజూరు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ పోలిరెడ్డి రమేష్, విజయ్‌కుమార్

వంగర: మగ్గూరు ఎయిడెడ్ పాఠశాల, కింజంగి ఆర్ అండ్‌ఆర్ కాలనీ పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లకు బిల్లులు మంజూరు చేయాలని సర్పంచ్‌లు పోలిరెడ్డి రమేష్, బెజ్జిపురం వెంకటేశ్వరి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు తహసీల్దార్ చిరంజీవికి వినతిపత్రం అందించారు. ఎన్నికల సమయంలో మగ్గూరు పాఠశాలలో రూ.1.50 లక్షలు, కింజంగి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రూ.2 లక్షలు వెచ్చించి మరుగుదొడ్లు నిర్మించామని, ఆ బిల్లులు ఇంతవకు మంజూరు చేయలేదని వాపోయారు.

ముందస్తు జాగ్రత్తలతోనే వ్యాధులు దూరం



సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

బొబ్బిలి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పి.రవికుమార్ అన్నారు. తన కార్యాలయంలో సోమవారం వైద్యారోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, కాలువల్లో పూడికలు తీసి, బ్లీచింగ్ చల్లాలని సూచించారు. ప్రజలకు సురక్షిత తాగునీరు సరాఫరా అయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టాలని, ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే వెంటనే తగిన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పిరిడి, పక్కి పీహెచ్‌సీల వైద్యాధికారులు వంశీ, తనూజ, ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రావణ్, ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వాణిజ్య, ఉద్యాన పంటలను ప్రోత్సహించాలి



ఫీల్డ్‌అసిస్టెంట్లకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ


బొబ్బిలి రూరల్: గ్రామీణ ప్రాంత రైతులు వాణిజ్య, ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపేలా వారికి సరైన అవగాహన కల్పించాలని ఎంపీడీఓ పి.రవికుమార్ సూచించారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో సోమవారం ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ప్రస్తుత సీజన్‌లో చేయాల్సిన ఉపాధి పనులపై సమీక్షించారు. ఉద్యాన, వాణిజ్య పంటల సాగు విస్తీర్ణంలో కేవలం 25 శాతం మాత్రమే ప్రగతి కనిపిస్తోందన్నారు. ఎక్కువ భూమి ఉన్న రైతులకు ఉద్యానవన పంటలు, వాణిజ్య పంటల సాగుపై అవగాహన కల్పించి, ఈ సీజన్‌లోనే ఆయా పంటలు సాగు చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ లక్ష్మీపతిరాజు, హౌసింగ్ ఏఈ సూర్యనారాయణ ఉన్నారు.

అనుమతి లేని వాటర్ ప్లాంట్లు సీజ్ చేస్తాం..

- తహసీల్దార్ రాజ్యలక్ష్మి

తెర్లాం: మండలంలో అనుమతి(లైసెన్స్) లేకుండా నిర్వహిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్లను సీజ్ చేస్తామని తహసీల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు. తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఎక్కడెక్కడ మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి, వాటికి అనుమతులు ఉన్నాయా, లేదా అని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్‌ఓలతో పరిశీలన చేయిస్తున్నామన్నారు. వాటర్ ప్లాంట్లను తనిఖీకి వచ్చిన అధికారులకు వాటి యజమానులు లైసెన్స్ పత్రాలు చూపించాలని కోరారు. లైసెన్స్ ఉన్న ప్లాంట్లను యథావిధిగా నిర్వహించుకోవచ్చని, లైసెన్స్ లేనివాటిని మాత్రమే సీజ్ చేస్తామన్నారు. దీనిపై పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కార్యదర్శులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రతీ పంచాయతీలో కార్యదర్శులు వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు.

వైభవంగా కలశపూజ



కలశపూజ నిర్వహిస్తున్న వేదపండితులు

తెర్లాం: మండలంలోని గంగన్నపాడు గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కలశపూజ నిర్వహించారు. వేదపండితుల మంత్రోశ్చరణ మధ్య భక్తులు స్వామివారికి 109 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఏటా గురుపౌర్ణమి సందర్భంగా స్వామివారికి కలశ పూజలు నిర్వహిస్తున్నామని అర్చకులు తెలిపారు. పూజా కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీఎల్‌ఎంతో బోధన తప్పనిసరి



ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనా సామగ్రిని పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ఉపాధ్యాయులంతా బోధనాభ్యసన సామగ్రిని తయారు చేసి, వాటి సాయంతో విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని ఎంఈఓ జె.త్రినాథరావు అన్నారు. జాతీయ విద్యా విధానం అమలు జరిగిన నాలుగేళ్లయిన సందర్భంగా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 'శిక్షా సప్తాహ్' వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్‌ఎం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఆర్.అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనా సామగ్రిని ఎంఈఓ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీఎల్‌ఎంల సాయంతో బోధన చేయడం వల్ల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 28 వరకు శిక్షా సప్తాహ్ వారోత్సవాలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

తెర్లాం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన వినతుల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బి.మధుసూదనరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. పలు సమస్యలపై వచ్చిన వినతులను ఆయా శాఖల అధికారులకు అందజేశారు.

పనిచేయని సర్వర్‌తో ఇక్కట్లు

స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ సెల్)లో వీడియో కాన్ఫరెన్స్ సర్వర్ పనిచేకపోవడంతో అధికారులు ఇబ్బంది పడ్డారు. అయితే వీడియో కాన్ఫరెన్స్ బదులు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు మండల అధికారులతో ప్రజా సమస్యలపై సమీక్షించారు.

ఆధార్ కేంద్రాల సేవలు వినియోగించుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ సులోచనరాణి

రామభద్రపురం: మండలంలో ఏర్పాటు చేస్తున్న ఆధార్ నమోదు కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎ.సులోచనరాణి అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలు తమ ఆధార్ కార్డులో పేరు, తండ్రి పేరు, స్వస్థలం, పుట్టిన తేదీ, చిరునామా తదితర వివరాల్లో తప్పులను సరిదిద్దుకునేందుకు ఈనెల 23 నుంచి 27 వరకు ప్రత్యేక క్యాంపెయిన్ చేపడుతున్నట్లు చెప్పారు. పుట్టిన తేదీ మార్పునకు సంబంధిత ధ్రువపత్రాలతో పాటు వీఆర్వో ధ్రువీకరణ పత్రంతో ఆధార్ నమోదు కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. స్థానిక గ్రామీణ బ్యాంకు వద్ద, పాత తహసీల్దార్ కార్యాలయంలో, కొట్టక్కిలో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూముల సబ్‌డివిజన్‌కు సంబంధించిన వినతులు అధికంగా వచ్చాయన్నారు. ఆమెతో పాటు డీటీ సుబ్బారావు ఉన్నారు.

ఎన్‌ఈపీతో సంక్షోభంలో విద్యారంగం

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు విజయగౌరి



ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బొబ్బిలి రూరల్: జాతీయ నూతన విద్యావిధానం(ఎన్‌ఈపీ)-2020ను అమలుచేసి విద్యావిధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టేస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వి.విజయగౌరి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎన్‌ఈపీతో ప్రాథమిక విద్య ప్రమాదంలో పడిందన్నారు. వేల సంఖ్యలో పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయన్నారు. ఉన్నత పాఠశాలలో సమాంతర మీడియం లేకుండా ఇంగ్లిష్ మీడియాన్ని మాత్రమే పెట్టి ఉపాధ్యాయులను కుదించారన్నారు. జీఓ 117ను అమలుతో పాఠశాలలు మూతపడ్డాయని, డ్రాపౌట్లు పెరిగాయని, విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చేరుతున్నారని అన్నారు. విద్యాహక్కు చట్టాలను నిర్వీర్యం చేసి నాలుగేళ్ల సంబరాలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్‌ఈపీ రద్దు అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు బుత్తల శ్రీనివాస్, కృష్ణదాస్, మహేష్, చంటి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు హేయం

బొబ్బిలి: టీడీపీ కూటమితో కలిసి వచ్చి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేయడం హేయమని మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ రియాజ్‌ఖాన్ అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులను ఖండిస్తూ స్థానిక గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, మద్దతుదారులపై దాడులు, వారి ఆస్తులను ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం మంటగలిసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పుస్తకాలు, బ్యాగులు వితరణ

సంతకవిటి: మండలంలోని బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి మందరాడ గ్రామానికి చెందిన లెంక జగన్, అతని స్నేహితుడు శేషాగ్నిహోత్రి కలిసి సుమారు రూ.10 వేలు విలువ చేసే పుస్తకాలను, విద్యార్థులకు బ్యాగులను సోమవారం వితరణ చేశారు. వాటిని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని హెచ్‌ఎం మల్లేశ్వరరావు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అదపాక దామోదరరావు, లక్ష్మీభాను, సత్యనారాయణ ప్రసాద్, కృష్ణ, పురుషోత్తం, రమేష్ శ్రీరామ్, భవానీ, పాల్గొన్నారు.

ఇదేమి చోద్యం



రోడ్డుపైకి విడిచిపెడుతున్న నీరు

రాజాం: పట్టణంలోని సీతారామ థియేటర్ పక్కన పెద్ద ఎత్తున భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ భవనాల అండర్ ఫ్లోర్‌లోకి నీరు చేరింది. ఈ నీటిని నిర్మాణ యాజమాన్యం ఇంజిన్ల సాయంతో ప్రధాన రోడ్డుపైకి విడిచిపెడుతున్నారు. దీంతో రహదారి మీదుగా ప్రయాణించే వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైకి వరదనీరు విడిచిపెడుతున్నా ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విద్యుత్ స్తంభాలకు మూగజీవాలను కట్టొద్దు

రేగిడి: గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు మూగజీవాలను కట్టవద్దని ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ లావేటి హరిబాబు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిపోవడం, స్తంభాలు విరిగిపడే అవకాశం ఉందన్నారు. మూగజీవాలను స్తంభాలకు కట్టడం వల్ల అవి విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వర్షాకాలంలో విద్యుత్ వినియోగంలో పలు జాగ్రత్తలు పాటించాలని, గాలులు వీచే సమయంలో విద్యుత్ స్తంభాల వద్ద నిల్చోరాదని సూచించారు.

కల్వర్టు నిర్మాణం

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని మాధవబజార్‌లో కుమ్మరివీధి జంక్షన్ వద్ద కొత్త కల్వర్టు నిర్మిస్తున్నామని ఏఈ వెంకట్ తెలిపారు. సోమవారం కల్వర్టు కవరింగ్ పలకల నిర్మాణ పనులు ప్రారంభించారు. రూ.1 లక్ష వ్యయంతో ఈ పనులు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సైడ్ వాల్స్‌తో మరో కాలువ నిర్మించి, ఇక్కడ ఉన్న తాగునీటి పైపులైన్‌కు ఇబ్బందులు లేకుండా మురుగుకాలువ నిర్మాణం చేపడతామన్నారు.

చెరువు ఆక్రమణకు అడ్డుకట్ట



ఆక్రమిత చెరువు గర్భంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జివలస రెవెన్యూ పరిధిలోని వెంకటపతిరాజు చెరువు ఆక్రమణకు గురవుతోంది. స్థానికంగా ఉన్న కొందరు ఆక్రమణదారులు చెరువు గర్భంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఆర్‌ఐ కల్యాణ చక్రవర్తి, సిబ్బంది అక్కడకు చేరుకుని అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ బోర్డును ఏర్పాటు చేశారు.

వరుస క్రమంలో వరినాట్లు

రేగిడి: రైతులు వరుస క్రమంలో వరినాట్లు వేసినట్లయితే పంటకు గాలి, వెలుతురు సమృద్ధిగా తగలడంతో పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడులు పొందే వీలుంటుందని ఏఓ జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో రైతు వంక పాపారావుకు చెందిన పొలంలో నాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. వరుసలో నాట్లు వేసుకోవడం వల్ల, కాలిబాటల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఆయనతో పాటు అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్పీలు పైల తవిటినాయుడు, కూనిబిల్లి రమణ ఉన్నారు.

స్థానిక వనరులతో సులభంగా విద్యాబోధన

రాజాం సిటీ: స్థానికంగా లభించే వనరులతో బోధనా సామగ్రిని తయారు చేసి దాని సాయంతో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని ఎంఈఓ పి.ప్రవీణ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. మున్సిపాలిటీ పరిధి బుచ్చెంపేట ఎంపీపీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. టీఎల్‌ఎంను ఉపయోగించి విద్యార్థులకు బోధిస్తున్న తీరుపట్ల ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తితో పాటు పఠనాసక్తిని పెంపొందించేందుకు టీఎల్‌ఎం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు మగేష్, ఉషారాణి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.